సాక్షి మెదక్

గురువారం । 19 । డిసెంబర్ । 2024



మెరుగైన సేవలు..

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

వివరాలు 8లో ▸



మొసళ్ల కలకలం

మంజీరా తీరంలో మొసళ్లు కలకలం రేపుతున్నాయి. రైతులు భయాందోళనకు గురయ్యారు.

వివరాలు 8లో ▸



డబ్బులు తక్కువగా వచ్చాయి

ఐకేపీ కొనుగోలు కేంద్రంలో కాంటా చేసిన ధాన్యానికి డబ్బులు తక్కువగా వచ్చాయని రైతులు ఆందోళన చేశారు.

వివరాలు 9లో ▸

చలి.. జాగ్రత్తలు తప్పనిసరి



మెదక్‌జోన్: జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతున్నాయి. పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తగిన జాగ్రత్తలు పాటించాలి. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రాణాలకే ముప్పు. థైరాయిడ్, అస్తమా, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు ఉన్న వారికి ఇన్‌ఫెక్షన్ సోకే ప్రమాదం ఉంది. వారు చలి వేళలో బయటకు రావొద్దు. మోకాళ్లు, కీళ్ల నొప్పులు ఉన్న వారు ఉదయం వాకింగ్ మానేయడం ఉత్తమం. చలికి చర్మం పొడిబారటం, దురద, పెదాలు పగలటం వంటి చూస్తుంటాం. తేలికైన చిట్కాలతో వీటిని నివారించుకోవచ్చు. గోరువెచ్చని నీరు తాగుతూ వేడిగా ఉన్న ఆహారం మాత్రమే తీసుకోవాలి. దాహం వేయకపోయినా రోజూ 8–9 గ్లాసుల నీరు తాగటం తప్పనిసరి.



- రవికుమార్, జనరల్ ఫిజీషియన్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్

'లైట్' తీస్కోవద్దు



రామాయంపేట(మెదక్): చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. సాధ్యమైనంత వరకు రాత్రి వేళల్లో ప్రయాణాలు చేయకపోవడం ఉత్తమం. మంచు కురిసే సమయంలో అత్యంత ప్రమాదకరం. ఆ సమయంలో సమీప వాహనాలు సైతం సరిగా కనిపించవు. కారులో ప్రయాణించే వారు హీటర్లు ఆన్ చేసుకోవడంతో పాటు విధిగా సీటుబెల్ట్ ధరించాలి. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. హెల్మెట్ ధరించడంతో పాటు చేతులకు గ్లౌజ్‌లు, కాళ్లకు షూ వేసుకోవడం ఉత్తమం. అలాగే ప్రతి వాహనానికి ఫాగ్ లైట్లు అమర్చుకోవాలి. పొగ మంచులో సైతం ఈ లైట్లు కొంతమేర ఉపయోగపడతాయి. వాహనాలకు రేడియం స్టిక్కర్లు ఉండేలా చూసుకోవాలి. రోడ్డు పక్కన వాహనం నిలిపినప్పుడు హెడ్‌లైట్‌తో పాటు వెనుక లైట్లు సైతం వెలుగుతూ ఉండాలి.



- వెంకటస్వామి, జిల్లా రవాణా శాఖ అధికారి

న్యూస్‌రీల్

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

మెదక్ కలెక్టరేట్: ఈనెల 26వ తేదీ నుంచి గ్రామీణ మహిళలకు టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్‌బీఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డిలోని స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో నెల రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. మెదక్, సంగారెడ్డి జిల్లా లకు చెందిన 18 ఏళ్ల నుండి 45 సంవత్సరాల లోపు ఉన్న గ్రామీణ మహిళలు అర్హులన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి సమాచారం కోసం 9490103390, 9490129839 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆయిల్‌పామ్‌తో రైతులకు లాభం

జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సంతోష్

కొల్చారం(నర్సాపూర్): ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అధిక అదాయం వస్తుందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సంతోష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ కృష్ణ మాట్లాడుతూ.. ఆయిల్‌పాం సాగు చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీలను అందిస్తుందన్నారు. తక్కువ నీటి అవసరాల ద్వారా పంటను సాగు చేయవచ్చని వివరించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ శ్వేతాకుమారి, ఉద్యానవన శాఖ మండల మేనేజర్ సుజాత, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

20న దివ్యాంగులకు వైద్య శిబిరం

మెదక్ కలెక్టరేట్: ఈనెల 20వ తేదీన జిల్లా ఆస్పత్రిలో దివ్యాంగులకు ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీఆర్డీఏ, డీడబ్ల్యూఓ, వైద్యారోగ్యశాఖ అధికారుల సమన్వయంతో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గ్రామీణ క్రీడాకారులకు మంచి అవకాశం

మెదక్‌మున్సిపాలిటీ: గ్రామ స్థాయిలో నైపుణ్యం గల క్రీడాకారులను వెలికితీసే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడలు నిర్వహిస్తుందని అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు. బుధవారం ఖోఖో పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో విద్యార్థుల్లో జాతీయ సమైక్యత, స్నేహభావం పెంపొందుతుందన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా యువజన, క్రీడల అధికారి నాగరాజు మాట్లాడుతూ.. ఖోఖో పురుషుల విభాగంలో శివ్వంపేట, మహిళల విభాగంలో నర్సాపూర్ రూరల్ జట్టు విజయం సాధించాయని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటుతాం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామస్థాయి నుంచి బీజేపీ బలోపేతంగా ఉందని, స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చిన ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అన్నారు. బుధవారం చిన్నశంకరంపేటలో బీజేపీ బూత్ కమిటీల నిర్మాణం పైచర్చించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్‌స్థాయి నుంచి పార్టీ నిర్మాణం జరుగుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పోగుల రాజు, నాయకులు నరేందర్‌రెడ్డి, ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

సమగ్రంగా.. సాగు లెక్క

వ్యవసాయ శాఖకు సంబంధించి సమగ్ర సమాచార సేకరణలో భాగంగా చేపడుతున్న 'వ్యవసాయ గణన' జిల్లాలో కొనసాగుతోంది. ఆరు నెలల క్రితమే మొదటి దశ పూర్తి కాగా, ఇటీవలే రెండో విడత సాగు గణన ప్రారంభించారు. వచ్చే ఏడాది జనవరి 15వ తేదీలోగా మూడో దశ పూర్తి చేసేలా అధికారులు కార్యాచరణ రూపొందించారు.

- రెండో విడత వ్యవసాయ గణన ప్రారంభం
- జనవరి 15వ తేదీ లోగా మూడో దశ పూర్తి!



మెదక్‌జోన్: జిల్లావ్యాప్తంగా సుమారు 5 లక్షల పైచిలుకు వ్యవసాయ సాగు భూములు ఉండగా, ఏటా 4 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. అయితే ప్రతి ఐదేళ్లకోసారి వ్యవసాయ గణన చేపడుతారు. ఈక్రమంలో మూడు దశల్లో సర్వే చేయాల్సి ఉండగా, జిల్లాలో ఇప్పటికే మొదటి దశ సాగు గణన పూర్తి చేశారు. జిల్లాలో 493 గ్రామాలు ఉండగా, అన్ని గ్రామాల్లో గత యాసంగి, వానాకాలం సీజన్‌లో ఎంతమంది రైతులు ఏ రకమైన పంటలు సాగు చేశారనే వివరాలను సేకరించారు. అయితే రెండో దశలో 98 గ్రామాలను మాత్రమే ఎంపిక చేశారు. ఇందులో 64 మంది వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొంటున్నారు. ప్రధానంగా సన్న, చిన్న, మధ్య, పెద్ద రైతులు ఎంతమంది ఉన్నారు. వీరు ఏ రకమైన పంటలు సాగు చేస్తున్నారు. అధిక దిగుబడి కోసం ఏ రకం విత్తనాలను ఎంపిక చేసుకున్నారు. వ్యవసాయంలో ఆధునిక పరికరాలను ఉపయోగిస్తున్నారా..? తదితర వివరాలను లెక్కించనున్నారు.

ఇప్పటికే అధికారులకు శిక్షణ

ఇక మూడో దశలో 7 శాతం గ్రామాలను మాత్రమే ఎంపిక చేయనున్నారు. ఈ లెక్కన 38 గ్రామాల్లో 2022– 23 సంవత్సరం ఆధారంగా నాటికీ, ప్రస్తుతం వ్యవసాయంలో మార్పులను పరిగణలోకి తీసుకోనున్నారు. అయితే వ్యవసాయ గణన 2025 జనవరి 15 తేదీలోగా పూర్తి చేయాలనే లక్ష్యంతో అధికారులు ముందుకు సాగుతున్నారు. ఇందుకు సంబంధించి ఈనెల 10వ తేదీన కలెక్టరేట్‌లో సిబ్బందికి శిక్షణ సైతం ఇచ్చారు. ఇదిలా ఉండగా సర్వే ఆధారంగానే రైతులకు పథకాల అందనున్నాయి. ఆయా జిల్లాలకు అత్యవసరంగా ఏ సంక్షేమ పథకం అమలు చేయాలి, వాటి సబ్సిడీ ఎంత వరకు ఇస్తే రైతుకు లాభసాటిగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించి పథకాలు ప్రవేశపెట్టనుంది.

రెండో దశ సర్వే ప్రారంభం



జిల్లాలో ఆరు నెలల క్రితం మొదటి దశ వ్యవసాయ గణన పూర్తి అయింది. 2, 3వ దశ సర్వే కోసం ఈనెల 10వ తేదీన సంబంధిత అధికారులకు శిక్షణ ఇచ్చాం. జనవరి 15వ తేదీ లోగా మూడో విడత సర్వేను పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం.

- బద్రినాథ్, సీపీఓ మెదక్

పనుల్లో వేగం పెంచండి

కలెక్టర్ రాహుల్‌రాజ్

కౌడిపల్లి(నర్సాపూర్): ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖర్ రాక సందర్భంగా ఏర్పాట్లకు సంబంధించి పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కేవీకేలో సభా ప్రాంగణం, హెలిప్యాడ్, సేంద్రియ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవీకే సమీపంలోని గిరిజన రైతుల పంట పొలాల్లో నాలుగు హెలిప్యాడ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతుల భూమికి నష్టం జరగకుండా మట్టితో క్యూరింగ్ చేయాలన్నారు. చెట్లు నరకవద్దని అధికారులకు సూచించారు. కాగా కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్ శంభాజీ దత్తాత్రేయ నల్కర్, సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ రవికుమార్ ఏర్పాట్ల గురించి వివరించారు. కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలో వివిధ గ్రామాలకు చెందిన 500 మంది సేంద్రియ సాగు, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో పాటు మరో 300 మంది రైతులు రానున్నారని తెలిపారు.

తప్పనిసరిగా మెనూ పాటించాలి

మెదక్‌జోన్: మెనూ తప్పకుండా పాటించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కాలేజీని అకస్మికంగా తనిఖీ చేశారు. వసతులు, భోజనం నాణ్యతలో ఎలాంటి వ్యత్యాసం రావొద్దని ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఇంటర్మీడియెట్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమీక్ష నిర్వహించారు. ఉత్తీర్ణత శాతం పెరగాలంటే డ్రాపౌట్స్‌ను నివారించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యా బోధనలో సమూల మార్పులు తీసుకురావాలని ఆదేశించారు.



కేవీకే భవనంపై నుంచి హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యం

ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా జిల్లా పోలీస్‌శాఖ పనిచేస్తుందని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో క్యూఆర్‌టీ పార్టీలతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా పరిధిలోని ప్రజలకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. సామాన్యులకు భరోసా కలిగించే విధంగా పోలీసింగ్ ఉంటుందని, శాంతి భద్రతల విషయంలో కఠినంగా ఉంటామన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో నేర నియంత్రణ అదుపునకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని పేర్కొన్నారు. ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలు నిర్వహిస్తే వెంటనే డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్ రూం 8712657888 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించుకోవాలి



ప్రతిభ చూపిన విద్యార్థులతో డీఈఓ రాధాకిషన్, అధికారులు

డీఈఓ రాధాకిషన్

మెదక్ కలెక్టరేట్: విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానం పెంచుకొని సుస్థిర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని డీఈఓ రాధాకిషన్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో తెలంగాణ బయోసైన్స్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈఓ హాజరై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించడానికి టాలెంట్ టెస్టులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. తెలుగు మీడియంలో ప్రథమ స్థానంలో సీహెచ్ హారిక, జెడ్పీహెచ్ఎస్ ఇస్లాంపూర్, ద్వితీయ స్థానంలో భానుప్రియ, జెడ్పీహెచ్ఎస్ ఇస్లాంపూర్ నిలిచారు. అలాగే ఇంగ్లీష్ మీడియంలో ప్రథమస్థానంలో నందిని, టీఎస్ఎంఎస్ రేగోడ్, ద్వితీయస్థానంలో తస్నీమ్, జీజీహెచ్ఎస్ మెదక్ విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో బయోసైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు దొంతి ప్రసన్నకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్, ఏఎంఓ సుదర్శనమూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంటుకట్టు సాగు.. దిగుబడి బాగు

భారత వ్యవసాయ పరిశోధన మండలి సంచాలకులు మీరా

ములుగు(గజ్వేల్): కూరగాయల్లో అంటుకట్టు మొక్కలను సాగు చేయడం వల్ల భూమి నుంచి వచ్చే వ్యాధులను తట్టుకొని అధిక దిగుబడులను సాధించే అవకాశముంటుందని హైదరాబాద్‌కు చెందిన భారత వ్యవసాయ పరిశోధన మండలి, వ్యవసాయ సాంకేతిక పరిశోధన సంస్థ సంచాలకులు డాక్టర్. షేక్.ఎన్.మీరా తెలిపారు. స్థానిక కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో కూరగాయల అంటుమొక్కల ఉత్పత్తి, దిగుబడుల మీద కేవీకే రామగిరి ఖిల్లాలో పని చేస్తున్న శాస్త్రవేత్తలకు బుధవారం నిర్వహించిన ఒక రోజు శిక్షణలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. రాబోయే కాలంలో తెలంగాణలోని కృషి విజ్ఞాన కేంద్రాలలో కూరగాయల అంటు మొక్కలను ఉత్పత్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రాబోయే సంవత్సరానికి నాణ్యమైన కూరగాయల అంటు మొక్కలను తక్కువ ధరలకు అందుబాటులోకి తేవడానికి శాస్త్రవేత్తలు కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారన్నారు. అలా కాకుండా రైతులు ఇక్కడే రాష్ట్రానికి సరిపడా కూరగాయలు పండించడానికి సాగులో అవసరమైన సాంకేతికతలు అంటుకట్టే పద్ధతిపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం మంచి పరిణామమని తెలిపారు. వర్సిటీ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్.దండ రాజిరెడ్డి మాట్లాడుతూ ఉద్యాన పంటలైన కూరగాయలు, పండ్లు, పూల సాగుతో ఇంతర పంటల కన్నా ఎక్కువ ఆదాయం వస్తుందన్నారు. హెయిర్ లూమ్స్ సీడ్లింగ్స్ అండ్ ప్లాంట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన కె.కృష్ణకిషోర్, విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డి.విజయ ప్రసంగించారు. కార్యక్రమంలో కూరగాయల విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ ప్రభాకర్‌రెడ్డి, యునివర్సిటీ అధికారులు ఏ భగవాన్, నటరాజన్, వ్యవసాయ సాంకేతిక పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త ఏ.ఆర్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న షేక్.ఎన్.మీరా, శిక్షణకు హాజరైన శాస్త్రవేత్తలు

బూర్గుపల్లిలో పోలీసుల విచారణ



హవేళీఘణాపూర్(మెదక్): మండలంలోని బూర్గుపల్లిలో పోలీసులు విచారణ చేపట్టారు. గ్రామానికి లెంక మల్లేశం మృతి చెందాడని అతడి భార్య పద్మ నకిలీపత్రాలు సృష్టించి రైతు బీమా పొందిన విషయంపై ఇటీవల ఏఈఓ స్వాతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో బుధవారం ఎస్ఐ సత్యనారాయణ గ్రామంలో పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మల్లేశం ఇటీవల గ్రామానికి వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

ముందస్తు బెయిల్ కోసం హైకోర్టుకు..

బతికి ఉండగానే చనిపోయినట్లు నకిలీ పత్రాలు సృష్టించి రైతుబీమా డబ్బులు కాజేసిన నిందితులు తమను అరెస్టు చేయకుండా బెయిల్ ఇవ్వాలంటూ హైకోర్టును ఆశ్రయించారు. అయితే వారికి బెయిల్ ఇవొద్దంటూ పోలీసులు కౌంటర్ దాఖలు చేశారు. మెదక్ మండలం గుట్టకిందిపల్లికి చెందిన ఎలిగడి మల్లేశం, పిట్ల శ్రీనివాస్ 2023లో మృతి చెందినట్లు డెట్ సర్టిఫికెట్ సృష్టించి రూ. 10 లక్షలు కాజేసిన విషయం తెలిసిందే. తమను తప్పుదోవపట్టించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఏఈఓ భార్గవి ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

22 నుంచి మూలవిరాట్ దర్శనం నిలిపివేత

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి మూలవిరాట్ దర్శనం ఈనెల 22 నుంచి నిలిపివేస్తున్నట్లు ఆలయ ఈఓ బాలాజీ బుధవారం తెలిపారు. స్వామివారి కల్యాణ మహోత్సవం ఈనెల 29న జరగనుందన్నారు. దీంతో స్వామి మూలవిరాట్‌తో పాటు అమ్మవార్ల మూలవిరాట్‌లకు రంగులను అద్దనున్నారన్నారు. దీంతో ఆరోజు నుంచి దర్శనాలు నిలిపేస్తున్నామన్నారు. ఈనెల 29న ఉదయం 6 గంటల నుంచి పునరుద్ధరిస్తామన్నారు. భక్తులు గమనించి ఆలయ అధికారులకు సహకరించాలని కోరారు.



21న పెన్షనర్ల నూతన భవనం ప్రారంభం

సంగారెడ్డి: పెన్షనర్ల నూతన భవనం ఈ నెల 21న శనివారం ప్రారంభించనున్నట్లు పెన్షనర్ల రాష్ట్ర సెక్రటరీ జనరల్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రభాకర్, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలో పదివేల మంది పెన్షనర్స్ ఉండగా, సంగారెడ్డి ఎస్‌టీఓ పరిధిలో 4500 మంది పెన్షనర్లు ఉన్నారని అన్నారు. 2018లో మాజీ మంత్రి హరీశ్‌రావు, కలెక్టర్ హన్మంతరావు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆశీర్వాదంతో సంఘ భవనానికి స్థలం కేటాయించారని గుర్తు చేశారు. 80 సంవత్సరాలు పైబడిన వారికి, కొత్తవారికి సన్మానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నర్సారెడ్డి, భక్కరెడ్డి, జగదీశ్వర్, మురళీధర్ పాల్గొన్నారు.



ఈ ఫొటోలోని మహిళ పేరు ఈరమ్మ. జిల్లా కేంద్రంలోని పిట్లంబేస్ కట్ట కింద గల అంగన్‌వాడీ మొదటి సెంటర్‌లో ఆయాగా పనిచేసి ఆరు నెలల క్రితం రిటైర్డ్ అయ్యారు. అయితే నేటికీ ఎలాంటి బెనిఫిట్స్ రాలేదు. నిత్యం సీడీపీఓ, డీడబ్ల్యూఓ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులు ఇదిగో.. అదిగో అంటున్నారు తప్ప సరైన సమాధానం చెప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి ఖర్చులకు కష్టంగా మారిందని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇచ్చి ఆదుకోవాలని వేడుకుంటుంది.

అ'విశ్రాంత' పోరాటం

- ఆరు నెలలుగా అందని రిటైర్మెంట్ బెనిఫిట్స్
- అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల ఆవేదన
- జిల్లాలో 58 మంది పదవీ విరమణ

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో రామాయంపేట, మెదక్, అల్లాదుర్గం, నర్సాపూర్ ప్రాజెక్టులు ఉండగా, మొత్తం 1,075 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అవసరమైన సేవలను అందిస్తున్నారు. 1,075 మంది టీచర్లు, 1,075 ఆయాలు ఉండాల్సి ఉండగా, ఇందులో 14 మంది టీచర్లు, 44 మంది ఆయాలు పదవీ విరమణ పొందారు. మరో 12 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసేందుకు విధుల్లో చేరిన టీచర్లు, ఆయాలకు గతంలో ఎలాంటి విద్యార్హతలు లేకుండా తీసుకోవడంతో వారి వయసు నిర్ధారణ కష్టతరంగా మారింది. ఈక్రమంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో ఎముకల దృఢత్వం ,నోట్లో పళ్లను పరీక్షించిన వైద్యులు వాటి ఆధారంగా వయసు నిర్ధారించారు. ఇంతవరకు బాగానే ఉన్నా పదవీ విరమణ పొందిన వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన ఆర్థిక సహాయం ఇప్పటివరకు అందలేదు.



కొల్చారం: రంగంపేట అంగన్‌వాడీ కేంద్రం

బెనిఫిట్స్ అందజేయాలి



మంత్రి సీతక్క ఇచ్చిన హామీ మేరకు రిటైర్మెంట్ పొందిన అంగన్‌వాడీ టీచర్లకు రూ. 2 లక్షలు, ఆయాలకు రూ. 1 లక్ష చొప్పున బెనిఫిట్స్ అందజేయాలి. ఆటు ఉద్యోగం పోయి, ఇటు ఆర్థిక సహాయం అందకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రెండు నెలలుగా వేతనాలు రావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలి.

- అన్నపూర్ణ, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు

నిధులు రావాల్సి ఉంది



గతంలో పదవీ విరమణ పొందనున్న టీచర్లకు రూ. 2 లక్షలు, ఆయాలకు రూ. 1లక్ష బెనిఫిట్స్ పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఆ జీఓ అమలులోకి రాలేదు. ముందు పంపించిన కొన్ని జిల్లాల్లో రిటైర్మెంట్ పొందిన ఆయాలకు రూ. 50 వేలు, టీచర్లకు రూ. 1 లక్ష అందజేస్తున్నారు. జిల్లాకు సంబంధించిన వివరాలు కమిషనర్‌కు పంపించాం. నిధులు రావాల్సి ఉంది.

- హైమావతి, డీడబ్ల్యూఓ, మెదక్

క్లుప్తంగా

మొసళ్ల కలకలం



తీరానికి వచ్చిన మొసలి

చిలప్‌చెడ్‌(నర్సాపూర్‌): మండల పరిధిలోని చండూర్‌ గ్రామ శివారులో గల మంజీరా వాగు తీరానికి బుధవారం రెండు మొసళ్లు వచ్చాయి. వాటిని చూసిన పలువురు రైతులు భయాందోళనకు గురయ్యారు. మంజీరాలో ఉంచిన మోటార్లు చెడిపోతే వాటి కోసం నదిలో దిగాల్సి ఉంటుందని, మొసళ్లను చూసిన తర్వాత నదిలో దిగడం అసాధ్యమన్నారు. సంబంధిత అధికారులు మొసళ్లను పట్టుకొని మంజీరా పరివాహ ప్రాంత రైతులకు ధైర్యం కల్పించాలన్నారు.

ఎనగండ్ల చెక్‌ డ్యాంపై..

కొల్చారం(నర్సాపూర్‌): ఎనగండ్ల గ్రామ శివారులోని మంజీరా చెక్‌ డ్యాం పైన బుధవారం మొసలి కలకలం సృష్టించింది. చేపల వేటకు వెళ్లిన జాలర్లకు మిట్ట మధ్యాహ్నం చెక్‌ డ్యాంపై సేద తీరుతూ కనిపించింది. దాదాపు 60 కిలోల వరకు ఉంటుందని తెలిపారు.

జాతీయ స్థాయి సైన్స్‌ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మర్కూక్‌(గజ్వేల్‌): జాతీయస్థాయి సైన్స్‌ టాలెంట్‌ పోటీల్లో మర్కూక్‌ మండలం దామరకుంట జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల విద్యార్థిని పూజ ప్రతిభ చాటి తృతీయ స్థానంలో నిలిచిందని ఎంఈఓ వెంకటరాములు తెలిపారు. బుధవారం పాఠశాలలో విద్యార్థినికి శాలువా కప్పి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్కూల్‌ ఇన్నోవేషన్‌ మారథాన్‌లో 2024 జాతీయస్థాయి వినూత్న ఆలోచనలు సేకరణలో భాగంగా పాఠశాల నుంచి ఆరు టీమ్స్‌ ద్వారా ప్రాజెక్టు నమూనాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచిన సందర్భంగా 18 మంది విద్యార్థులకు, గైడ్‌ ఉపాధ్యాయుడు బ్రహ్మయ్యకు ప్రశంసాపత్రం అందజేశారు. వినూత్న ప్రాజెక్టు అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.1.20 లక్షలు నుంచి రూ.1.50 లక్షల వరకు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏడుపాయల టెండర్ల ఆదాయం రూ.2.46 కోట్లు



టెండర్లు నిర్వహిస్తున్న ఈఓ, తదితరులు

పాపన్నపేట(మెదక్‌): ప్రసిద్ధి చెందిన ఏడుపాయల ఆలయం వద్ద వివిధ విక్రయాల కోసం బుధవారం నిర్వహించిన టెండర్ల ద్వారా రూ.2.46 కోట్ల ఆదాయం వచ్చింది. ఈఓ చంద్రశేఖర్‌, అసిస్టెంట్‌ కమిషనర్‌ సుధాకర్‌ రెడ్డి ఆధ్వర్యంలో సీల్డ్‌, ఓపెన్‌ టెండర్లు నిర్వహించారు. కొబ్బరికాయలు, బోండాలు విక్రయించుకునే హక్కు కోసం వేలం పాట నిర్వహించగా 8 మంది పాల్గొన్నారు. ఇందులో రూ.కోటి 11 లక్షల 20 వేల పాట పాడి మెదక్‌ పట్టణానికి చెందిన లింగోజీ వేలం దక్కించుకున్నారు. అలాగే, ఒడి బియ్యం పోగు చేసుకునే హక్కును జీవన్‌రెడ్డి అనే వ్యక్తి రూ.కోటి 9 లక్షల 50 వేలకు పాడారు. పూజ సామగ్రి విక్రయాలు చేసుకునేందుకు రూ.17 లక్షలు పాట పాడి బుడాల నర్సింలు వేలం దక్కించుకున్నారు. తల నీలాల కోసం నిర్వహించిన టెండర్లలో ఖమ్మంకు చెందిన ఎస్‌.దుర్గారావు రూ.8,30,000 పాట పాడారు. కొబ్బరి ముక్కలు పోగు చేసుకునే టెండర్‌ కొనసాగుతుంది.

పంట రక్షణ చర్యలు చేపట్టాలి



సంగారెడ్డి జోన్‌: చలి ప్రభావంతో యాసంగి నారుమడుల్లో వరి నారు ఎదగకపోవచ్చు. ఆకులు పసుపు ఎరుపు రంగులోకి మారుతాయి. కొన్ని సార్లు నారు చనిపోవచ్చు. అందువల్ల రైతులు కొన్ని రక్షణ చర్యలు చేపట్టాలి. నారుమడుల పై ఇనుప చువ్వలు లేదా వెదురు కర్రలతో ఊతమిచ్చి పైన పలుచని పాలిథిన్‌ షీట్‌ లేదా ఖాళీ యూరియా బస్తాలతో తయారు చేసిన పట్టాలతో సాయంత్రం పూట కప్పి, మరుసటి రోజు ఉదయాన్నే తీసివేయాలి. రాత్రివేళల్లో నారుమడిలో నీరు నిండుగా ఉంచి, తెల్లవారుజామున తీసివేసి కొత్త నీరు పెట్టాలి. చలి వల్ల మొక్కజొన్నలో భాస్వరం లోపించి ఆకులు ఉదా రంగులోకి మారుతాయి. భాస్వరం లోప లక్షణాలు గమనించినట్లయితే నివారణకు 10 గ్రాముల 19-19-19 లేదా డీఏపీ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



– శివప్రసాద్‌, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, సంగారెడ్డి

వేడి వేడి ఆహారం తీసుకోవాలి



సాక్షి సిద్దిపేట : చలి తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, ఆస్తమా పేషెంట్స్‌ జాగ్రత్తగా ఉండాలి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు ఉదయం 10 గంటల వరకు బయటకు రాకూడదు. కూల్‌ డ్రింక్స్‌, ఐస్‌ క్రీమ్‌, ఆల్కహాల్‌కు దూరంగా ఉండాలి. తాజా వేడి వేడి ఆహారం తీసుకోవాలి. నువ్వులతో చేసిన ఆహార పదార్థాలు, మాంసాహారం ఎక్కువగా తీసుకోవాలి. రూమ్‌ హీటర్స్‌ వాడాలి. కానీ అతిగా వినియోగించొద్దు. బయటకు వెళ్లే సమయంలో ఉన్ని దుస్తులు, స్వెటర్లు, మఫ్లర్స్‌, మంకీ క్యాప్స్‌ ధరించాలి. సిద్దిపేటలో ప్రస్తుతం 75 నుంచి 80 ఎయిర్‌ క్వాలిటీ ఇండెక్స్‌ ఉంది. ఇది 50 కి తక్కువగా ఉంటే మంచిది. చలి పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలి.



– డాక్టర్‌ గణేశ్‌ వెనిశెట్టి, జనరల్‌ ఫిజీషియన్‌ సిద్దిపేట

మెరుగైన సేవలు.. పెరిగిన ప్రసవాలు



న్యాల్‌కల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

జిల్లాలోని ప్రభుత్వాస్పత్రులకు క్యూ కడుతున్న గర్భిణులు

- 2024లో లక్ష్యానికి మించి 23,811 ప్రసవాలు
- ప్రైవేట్‌ ఆస్పత్రులకు దీటుగా వైద్యం

న్యాల్‌కల్‌(జహీరాబాద్‌): ఒకప్పుడు ప్రభుత్వాస్పత్రులంటే ప్రజలకు సరైన నమ్మకం లేక ప్రైవేట్‌ ఆస్పత్రులకు వెళ్లేవారు. అక్కడ సరైన వైద్యం అందకపోయినా వేలాది రూపాయలు ఖర్చు చేసుకొని తీవ్ర ఇబ్బందులు పడేవారు. ముఖ్యంగా గర్భిణులు అధిక శాతం ప్రైవేట్‌ ఆస్పత్రులకు వెళ్లేవారు. కాని నేడు పరిస్థితులు మారాయి. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టింది. వైద్యులు, వైద్య సిబ్బంది ప్రజలకు భరోసా కలిస్తూ మంచి వైద్యం అందించడంతో రోగులు ప్రభుత్వాస్పత్రులకు వస్తున్నారు.

జిల్లాలో జిల్లా ఆస్పత్రి 1, ఏరియా ఆస్పత్రులు 4, కమ్యూనిటీ హెల్త్‌ సెంటర్లు 2, పీహెచ్‌సీలు 29, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు 445 ఉన్నాయి. దాదాపు అన్ని ఆస్పత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ముఖ్యంగా గర్భిణులు ప్రసవాల కోసం ప్రైవేట్‌ ఆస్పత్రులకు వెళ్లేవారు. అక్కడకు వెళ్లిన వారికి వైద్యులు అధిక శాతం గర్భిణులకు అవసరం లేకున్నా సీజరింగ్‌ చేసి అధిక డబ్బులు వసూలు చేసేవారు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం వారిని ప్రభుత్వాస్పత్రులకు వచ్చేలా చర్యలు చేపట్టింది.

అవగాహన కార్యక్రమాలు

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా వైద్యులకు, వైద్య సిబ్బందికి తరచుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. అధిక ప్రసవాలు నిర్వహించిన వైద్యులు, వైద్య సిబ్బందికి అవార్డులు, ప్రశంసా పత్రాలు అందిస్తుంది. దీంతో ఆస్పత్రులకు వచ్చే వారికి నాణ్యమైన వైద్యం అందించడంతోపాటు గర్భిణులకు నమ్మకం కలిగేలా, సాధారణ ప్రసవాలు జరిగేలా వైద్యులు, వైద్య సిబ్బంది కృషి చేస్తున్నారు. దీంతో ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా తగ్గి ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య బాగా పెరిగింది.

లక్ష్యానికి మించి..

2023లో 22,263 ప్రసవాలు లక్ష్యం కాగా 24,489 ప్రసవాలు జరిగాయి. 2024లో 21,618 ప్రసవాలు లక్ష్యం కాగా 23,811 ప్రసవాలు జరిగినట్లు అధికారులు తెలిపారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమష్టి కృషితో ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య లక్ష్యానికి మించి జరుగుతున్నాయి. ఈనెల 16న న్యాల్‌కల్‌ పీహెచ్‌సీలో కేవలం 17 గంటల వ్యవధిలో ఐదు ప్రసవాలు చేసి న్యాల్‌కల్‌ పీహెచ్‌సీ రికార్డు సృష్టించింది. దీంతో ప్రైవేట్‌ ఆస్పత్రులకు వెళ్లే వారి సంఖ్య బాగా తగ్గింది.



సిబ్బందిని అభినందిస్తున్న వైద్యులు

నార్మల్‌ డెలవరీ చేశారు



ప్రభుత్వ దవాఖానాకు రావాంటే కొంచెం భయమేసింది. ఆస్పత్రికి వచ్చిన తర్వాత ఏఎన్‌ఎం బయపడొద్దు నీకు నార్మల్‌ డెలవరీ చేస్తానని భరోసా ఇచ్చింది. రూపాయి ఖర్చు లేకుండా సుఖ ప్రసవం చేశారు. ప్రభుత్వాస్పత్రిలో మంచి వైద్యం అందుతుందని సంతోషం వ్యక్తం చేసింది.

– తస్లీం, చాల్కి గ్రామం

సుఖ ప్రసవాలు జరిగేలా కృషి



ప్రసవాలకు వచ్చేలకు వచ్చే గర్భిణులకు సాధ్యమైనంత వరకు సుఖ ప్రసవం జరిగేలా కృషి చేస్తున్నా. ఈ నెల 16న కేవలం 17 గంటల్లో ఐదుగురికి సుఖ ప్రసవాలు చేశా. ఇప్పటి వరకు 300కు పైగా సుఖ ప్రసవాలు చేశాను.

– ఎచ్‌.సబిత, స్టాఫ్‌నర్స్‌, పీహెచ్‌సీ న్యాల్‌కల్‌

లక్ష్యానికి మించి ప్రసవాలు



ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. గతంలో సరైన అవగాహన లేక ప్రైవేట్‌ ఆస్పత్రుకు వెళ్లి ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఈ ఏడాది లక్ష్యానికి మించి 23,811 ప్రసవాలు నిర్వహించాం.

– గాయత్రీదేవి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, సంగారెడ్డి

ప్రేమ.. పెళ్లి.. విషాదం

- ఇన్‌స్టాగామ్‌లో పరిచయం, 21 రోజుల కిందట పెళ్లి
- ఉరేసుకొని నవ వధువు ఆత్మహత్య
- మృతురాలు యూట్యూబ్‌ ఫోక్‌ సింగర్‌
- జగదేవ్‌పూర్‌ మండలంలో ఘటన



శృతి మృతదేహం

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): ఇన్‌స్టాగామ్‌తో పరిచయమై.. మూడు ముళ్లతో ఒకటై.. పట్టుమని నెల గడవకముందే నవ వధువు ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన బుధవారం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌ మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. జగదేవ్‌పూర్‌ మండలం పీర్లపల్లి గ్రామానికి ఎర్ర భిక్షపతి, సత్యమ్మ దంపతుల కుమారుడు ఎర్ర దయాకర్‌ హైదరాబాద్‌లో క్యాబ్‌ నడపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నిజామాబాద్‌ జిల్లా వర్ని మండలం తిమ్మాపూర్‌ గ్రామానికి శ్యామల, రమేశ్‌ కుతూరు, ఫోక్‌ సింగర్‌(యూట్యూబ్‌) శృతి (26) ఇన్‌స్ట్రాగామ్‌లో పేరడి పాటలతో ఇటీవల ఫేమస్‌ అయ్యింది. ఇన్‌స్ట్రాగామ్‌ ఇద్దరి మధ్య కొన్ని నెలల కిందట పరిచయం ఏర్పడి ప్రేమపెళ్లి వరకు వచ్చింది. ఇద్దరి ప్రేమ విషయం ఇరువురి తల్లిదండ్రులకు తెలిసింది. యువతి తల్లిదండ్రులు ఆర్థిక పరిస్థితుల కారణంగా పెళ్లికి కొద్ది రోజులు ఆగాలని చెప్పడంతో కొద్ది రోజులు చూసి గత నెల నవంబర్‌ 27న పీర్లపల్లి గ్రామంలో పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. పెళ్లికి యువతి తల్లిదండ్రులు, బంధువులు హాజరు కాలేదు. నవ దంపతులు పీర్లపల్లిలోనే ఉంటున్నారు. బుధవారం గ్రామంలోనే దయాకర్‌ వాళ్ల కులానికి చెందిన వారి దశదినకర్మకి తల్లిదండ్రులతో కలిసి వెళ్లారు. మధ్యాహ్న సమయంలో శృతిని కూడా తీసుకెళ్లడానికి దయాకర్‌ ఇంటికి రాగా ఉరేసుకొని కనిపించింది. వెంటనే స్థానికులకు, శృతి తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్‌ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నాలుగు నెలల గర్భిణి

ప్రస్తుతం శృతి నాలుగు నెలల గర్భిణి కాగా ఇంటి వద్దనే ఉంటుంది. కుటుంబ కలహాల వల్లే ఆత్మహత్య చేసుకొని ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. వరకట్నం కోసమే శృతిని చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. ఆస్పత్రి వద్ద ఇరువురి కుటుంబాల మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా పోలీసులు సముదాయించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చంద్రమోహన్‌ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన శివ్వంపేట ఖోఖో జట్టు

ఖో ఖోలో శివ్వంపేట జట్టు ప్రతిభ

శివ్వంపేట(నర్సాపూర్‌) : సీఎం కప్‌ జిల్లా స్థాయి పోటీల్లో శివ్వంపేట మండల క్రీడాకారులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. 17, 18 తేదీల్లో మెదక్‌ జరిగిన వివిధ క్రీడా పోటీల్లో శివ్వంపేట మండలం నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. బుధవారం ఖో ఖో ఫైనల్‌ కొల్చారం జట్టుతో తలపడి విజయం సాధించి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యారు. 27 నుంచి 30 వరకు హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థులను ఎంఈఓ బుచ్చనాయక్‌, పీడీ చంద్రమోహన్‌ అభినందించారు.

వాలీబాల్‌ క్రీడలో ధర్మాజీపేట విద్యార్థులు

దుబ్బాకటౌన్‌: ఈ నెల 17, 18వ తేదీల్లో సిద్దిపేటలో నిర్వహించిన సీఎం కప్‌ పోటీల్లో వాలీబాల్‌ క్రీడలో దుబ్బాక మున్సిపల్‌ పరిధిలోని ధర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన అభిజ్ఞ, అక్షయ బాలికల విభాగంలో, అభినవ్‌ బాలుర విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు బుధవారం పాఠశాల హెచ్‌ఎం సాదత్‌ అలీ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.



ఎంపికైన విద్యార్థులు

జీవశాస్త్ర ప్రతిభా పరీక్షల్లో..

సిద్దిపేటజోన్‌: జీవశాస్త్ర ప్రతిభా పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. బుధవారం స్థానిక టీటీసీ భవన్‌లో జిల్లా స్థాయి ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. ఇంగ్లిష్‌ మీడియం విభాగంలో ఇరుకోడ్‌ ఆదర్శ పాఠశాల విద్యార్థి వేణు ప్రథమ స్థానంలో నిలువగా, మర్పడగ పాఠశాల విద్యార్థి అభివర్షిక, సంజనలు ద్వితీయ స్థానంలో నిలిచారు. అదే విధంగా తెలుగు మీడియం విభాగంలో చికోడ్‌ పాఠశాల విద్యార్థి భువన ప్రథమ స్థానంలో నిలువగా, వెల్కటూర్‌ పాఠశాల విద్యార్థి సంజన ద్వితీయ స్థానంలో నిలిచింది. జిల్లా సైన్స్‌ అధికారి శ్రీనివాస్‌, పరీక్షల విభాగం కార్యదర్శి శౌకత్‌ అలీ, సిద్దిపేట అర్బన్‌ మండల విద్యాధికారి ప్రభాకర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

కొల్చారం(నర్సాపూర్‌): మంజీరా వాగులోకి చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామ శివారులో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొల్చారం ఎస్‌ఐ మహమ్మద్‌ గౌస్‌ కథనం మేరకు.. పోతంశెట్టిపల్లి గ్రామానికి చెందిన జలగం ఏసు(36) చేపల వేట కోసం 16వ తేదీన మంజీరా వాగులోకి వెళ్లాడు. రెండు రోజులు అవుతున్నా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా మంజీరా పాయలోని ఓ గుండు పై మృతదేహమై కనిపించాడు. ఏసుకు తరచూ ఫిట్స్‌ వచ్చేదని, అదే మృతికి కారణమై ఉండొచ్చని కుటుంబ సభ్యులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..

కొల్చారం(నర్సాపూర్‌): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన మండల కేంద్రం సమీపంలోని మెదక్‌-నర్సాపూర్‌ జాతీయ రహదారి లోతు వాగు వద్ద బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహమ్మద్‌ గౌస్‌ కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం రేపల్లె వాడుకు చెందిన పిట్ల సాయిలు ఆరేళ్ల కిందట బతుకుదెరువు కోసం దుబాయ్‌ వెళ్లాడు. భార్య స్వప్న (26) రెండేళ్ల నుంచి పిల్లలతో హైదరాబాద్‌లో ఉంటూ కారు షోరూంలో పని చేస్తుంది. స్వప్న మేన బావ శ్రీనుతో కలిసి బైక్‌ పై ఎల్లారెడ్డికి వస్తుంది. బైక్‌ లోతు వాగు వద్దకు రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్వప్న అక్కడికక్కడే మృతి చెందగా, శ్రీనుకు తీవ్ర గాయాలయ్యాయి. మృతురాలి మామ సంగయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు

రెండో అంతస్తు నుంచి పడి కార్మికుడు



యోగీశ్వర్‌ రెడ్డి (ఫైల్‌)

పటాన్‌చెరు టౌన్‌: రెండో అంతస్తుపై నుంచి పడి కార్మికుడు మృతి చెందిన ఘటన బీడీఎల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం భానూరు గ్రామానికి చెందిన యోగీశ్వర్‌ రెడ్డి (30) కేకే ఎనర్జీ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో పాశమైలారంలోని ఓ పరిశ్రమలో సోలార్‌ పలకలు కడిగే పని కోసం బుధవారం వెళ్లాడు. రెండో అంతస్తులో పని చేస్తుండగా కింద పడిపోయాడు. తీవ్ర గాయాలైన అతడిని పటాన్‌చెరులోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇద్దరికి గాయాలు..

కొండపాక(గజ్వేల్‌): బైక్‌ అదుపుతప్పి పడిపోవడంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన కొండపాక మండలంలోని దుద్దెడ గ్రామంలోని అంబేడ్కర్‌ చౌరస్తా వద్ద బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్‌ అక్బర్‌, మహమ్మద్‌ రియాన్‌ సిద్దిపేటలో బంధువు మృతి చెందడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. దుద్దెడ శివారులో మలుపు వద్ద బైక్‌ అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక 108 అంబులెన్సు సిబ్బంది గణేశ్‌, శ్రీనివాస్‌లు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను సిద్దిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

హెడ్‌ కానిస్టేబుల్‌పై దాడి – వ్యక్తి రిమాండ్‌

పుల్‌కల్‌(అందోల్‌) : విధులకు ఆటంకం కలిగించి, హెడ్‌ కానిస్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పుల్‌కల్‌ ఎస్సై క్రాంతికుమార్‌ కథనం మేరకు.. పుల్‌కల్‌ గ్రామానికి చెందిన సంగమేశ్‌ బస్టాండ్‌ ప్రాంతంలో న్యూసెన్స్‌ చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు పోలీస్‌ 100కు కాల్‌ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని న్యూసెన్స్‌ చేస్తున్న వ్యక్తికి నచ్చజెప్పినా వినలేదు. ఈ దాడిలో హెడ్‌ కానిస్టేబుల్‌ హరికృష్ణకు గాయాలయ్యాయి. న్యూసెన్స్‌ చేసి, కానిస్టేబుల్‌ విధులకు ఆటంకం కలిగించినందుకు సంగమేశ్‌పై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పాపన్నపేట(మెదక్‌): మతి స్థిమితం లేని ఓ వ్యక్తి ఏడుపాయల్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం వెలుగు చూసింది. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌ గౌడ్‌ కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా బిలాల్‌పూర్‌ గ్రామానికి చెందిన బలుపాటి ఆనంద్‌ (33) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయాడు. 15న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బుధవారం ఏడుపాయల దుర్గా భవానీ ఆలయ సమీపంలోని మంజీరా నది ఒడ్డున ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అటుగా వెళ్లిన వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

యువకుడి అదృశ్యం



మధు (ఫైల్‌)

టేక్మాల్‌(మెదక్‌): యువకుడు అదృశ్యమైన ఘటన టేక్మాల్‌ మండలంలోని కోరంపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజేశ్‌ కథనం మేరకు.. గ్రామానికి చెందిన బోయిని మధు వ్యవసాయంతోపాటు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తాగుడుకు బానిసై తరచూ భార్యతో గొడవ పడుతుండటంతో తల్లిగారింటికి వెళ్లిపోయింది. 17న రాత్రి ఇంట్లో అందరూ పడుకున్న సమయంలో మధు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఇంటి నుంచి వెళ్లినప్పుడు బ్లూ కలర్‌ షర్ట్‌, జీన్స్‌ పాయింట్‌ వేసుకున్నట్లు తెలిపారు. తల్లి బోయిని సంగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

డీఆర్‌డీఏ అదనపు పీడీ బాలకృష్ణ

కొండపాక(గజ్వేల్‌): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం కృషి చేస్తూ తగిన ప్రోత్సాహకాన్ని అందజేస్తుందని డీఆర్‌డీఏ అదనపు పీడీ బాలకృష్ణ పేర్కొన్నారు. మండల పరిధిలోని దుద్దెడలో యూనియన్‌ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉన్నతి లబ్ధిదారులకు టైలరింగ్‌, డైరీ, ఫార్మ్‌, వర్మి కంపోస్టు ఎరువుల తయారీ కోసం శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధి పొందేలా శిక్షణ ఇవ్వడంతోపాటు బ్యాంకుల నుంచి రుణ సాయం పొందేలా ప్రోత్సాహకాన్ని అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఐకేపీ ఏపీఓ సర్వర్‌ పాషా, పంచాయతీ కార్యదర్శి చక్రపాణి, ట్రైనర్‌ రేణుక, సంస్థ సిబ్బంది నజీమ్‌, నాగరాజు, స్వప్న, కనకయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలకృష్ణ

కోడి పిల్లలు.. విలవిల



షెడ్డు లోపలి భాగంలో డబ్బాల సాయంతో వేసిన మంటలు



మృత్యువాత పడిన కోడి పిల్లలు

ప్యారవరం గ్రామంలో చలికి మృత్యువాత

సంగారెడ్డి జోన్‌: చలికి తట్టుకోలేక కోడి పిల్లలు మృత్యువాత పడుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. ఝరాసంగం మండల పరిధిలోని ప్యారవరం గ్రామంలో సంగమేశ్వర్‌ తన వద్ద ఉన్న పౌల్ట్రీ షెడ్డులో కోడి పిల్లల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నాడు. షెడ్డు లోపలికి గాలి వెళ్లకుండా బయటి భాగంతో పాటు లోపలి భాగంలో టార్పిన్‌ కవర్‌ను కట్టాడు. షెడ్డులో 9,000 కోడి పిల్లలు ఉన్నాయి. అందులో 1,000 కోడిపిల్లలను ఒక విభాగంగా 9 విభాగాలను ఏర్పాటు చేశారు. 9 బ్యాలర్‌ (డబ్బా)లను ఏర్పాటు చేసి కట్టెలు వేసి మంటతో వెచ్చదనం అందిస్తున్నాడు. ప్రతి రోజూ రాత్రి 8 గంటలకు, అర్ధ రాత్రి 12 గంటలకు, వేకువ జామున 3 గంటలకు, ఉదయం 6 గంటలకు మంటలను వేస్తూ కాపాడుకుంటున్నాడు. అయినప్పటికీ ప్రతి రోజూ సుమారు 15 నుంచి 20 కోడి పిల్లల మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు. జిల్లాలో రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పడిపోయి, చలి తీవ్రతలు పెరిగిపోతున్నాయి. దీంతో పశు సంరక్షణ కోసం కాపరులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

టీచర్లకు రెమ్యునరేషన్‌ చెల్లించాలి

టీపీటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌

సంగారెడ్డి ఎడ్యుకేషన్‌: సమగ్ర కుటుంబ సర్వే విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్‌ చెల్లించడంతో పాటు అటెండెన్స్‌ సర్టిఫికెట్లు ఇవ్వాలని టీపీటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌ ఏఓ పరమేశ్వర్‌, సీపీఓ బాలశౌరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సోమశేఖర్‌ మాట్లాడుతూ.. సమగ్ర కుటుంబ సర్వే పూర్తి చేసి 20 రోజులు దాటిందని, ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్‌ అందడంలో జాప్యం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్‌తో పాటు జిల్లా ఉపాధ్యక్షులు నాజర్‌ పటేల్‌, రాష్ట్ర బాధ్యులు కౌన్సిలర్లు లక్ష్మయ్య యాదవ్‌, సంజీవయ్య, కమ్రొద్దీన్‌, జిల్లా కార్యదర్శి రవీందర్‌ తదితరులు పాల్గొన్నారు.